క్లుప్తంగా

కార్మికుడి కుటుంబానికి ఆర్థిక సాయం



చెక్కు అందజేస్తున్న కార్మికులు, మేనేజర్

జహీరాబాద్ టౌన్: మండలంలోని బూచినెల్లి శివారులో గల సీఐఈ కంపెనీలో పనిచేస్తున్న కార్మికుడు అంబటి అంజయ్య మృతి చెందగా తోటి కార్మికులు ఆర్థిక సహాయం అందజేశారు. పట్టణానికి చెందిన అంజయ్య కంపెనీలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. శుక్రవారం ఆకస్మికంగా మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కార్మికులు ఆయన కుటుంబాన్ని ఆదుకొనేందుకు ముందుకొచ్చారు. కార్మికులందరూ కలిసి ఒక రోజు వేతనం రూ.69,585 లు కార్మికుడి కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రొడక్షన్ మేనేజర్ సదానంద్ కుల్‌కర్ణి, హెచ్‌ఆర్ మేనేజర్ సుధాకర్, అసిస్టెంట్ మేనేజర్ ప్రదీప్, సూపర్‌వైజర్ శ్రీనివాస్, మణికంఠ,కాంట్రాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో గ్రాడ్యుయేషన్ డే



ప్రగతి రిపోర్టులు అందుకున్న చిన్నారులు

నారాయణఖేడ్: అంగన్‌వాడీ కేంద్రాలు చిన్నారుల భవిష్యత్తుకు బాటలు వేస్తాయని ఖేడ్ ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ సుజాత అన్నారు. మండల పరిధిలోని లింగాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు ప్రగతి రిపోర్టులను అందజేశారు. చిన్నారుల ఆటలు, పాటల తదితర కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ ప్రమీల, శిశు సంక్షేమశాఖ సమన్వయకర్త నర్సింహులు, అంగన్‌వాడీ టీచర్లు ఇందిర, సునీత, విజయ, మాజీ ఎంపీటీసీ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి విరాళం

నారాయణఖేడ్: సుప్రసిద్ధ బోరంచ నల్లపోచమ్మ తల్లి ఆలయానికి పెయింటింగ్ కోసం పలువురు భక్తులు శుక్రవారం విరాళాలు సమర్పించారు. హైదరాబాద్ బోరబండకు చెందిన సెలూన్‌షాప్ యజమాని ఎం.రాజు రూ.5,111 విరాళంగా ఆలయ ఉద్యోగి శేఖర్‌కు అందజేశారు. జోగిపేట కొండారెడ్డి పల్లికి చెందిన ఆర్.ముత్తయ్య రూ.5వేలు, మరెల్లి గ్రామానికి చెందిన ఎం.మహేశ్ రూ.2,111, టి.లింగంపల్లికి చెందిన గాలయ్య రూ.1,111 విరాళంగా అందజేశారు. విరాళాలు సమర్పించే భక్తులు 91825 25441 నంబరులో లేదా ఆలయంలో సంప్రదించి అందజేయవచ్చని ఆలయ నిర్వాహకులు పేర్కొన్నారు.

చెక్కు పంపిణీ



చెక్కు అందజేస్తున్న భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్: నిజాంపేట్ మండలం బాచేపల్లి గ్రామానికి చెందిన సీహెచ్ రేణుక అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందారు. సీఎంఆర్‌ఎఫ్ ద్వారా రూ.15వేలు మంజూరు కాగా ఆ చెక్కును మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి శుక్రవారం అందజేశారు. ఖేడ్ మండల సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు జగదీశ్వరాచారి, పీఏసీఎస్ చైర్మన్ సంగారెడ్డి, ప్రవీణ్ పాల్గొన్నారు. వరంగల్‌లో ఈనెల 27న నిర్వహించనున్న బీఆర్‌ఎస్ బహిరంగ సభ వాల్‌రైటింగ్‌ను భూపాల్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ర్యాలమడుగు మాజీ ఎంపీటీసీ అమర్యానాయక్ తల్లి మరణించడంతో ఆయనను పరామర్శించారు.

చనిపోతున్నానని మిత్రుడికి ఫోన్

యువకుడి ఆచూకీ కోసం గాలింపు



తుడుం నరేష్ (ఫైల్)

మునిపల్లి(అందోల్): ఆత్మహత్య చేసుకుంటున్నానని తన స్నేహితునికి ఫోన్ చేసి చెప్పాడు. ఆ తరువాత ఫోన్ స్విచాఫ్ చేసి కనబడకుండా పోయాడు. ఈ ఘటన మునిపల్లి మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ రాజేశ్ నాయక్ కథనం ప్రకారం... ఖమ్మంపల్లి గ్రామానికి తుడుం నరేశ్ (22) అనే యువకుడు మతిస్థిమితం లేదని, మిత్రుడు సుదర్శ్‌కు ఫోన్ చేసి తాను చనిపోతున్నానని చెప్పాడు. వెంటనే కుటుంబ సభ్యులు బుదేరా పోలీస్‌లకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. పోలీసులు యువకుడి ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

గిరిజనులకు ఉచితమిలా

- దేశంలోనే మొదటి లా కాలేజీ
- ఏటా 60 మందికి బోధన
- ఉచిత హాస్టల్‌తోపాటు తదితర సౌకర్యాలు
- విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి



సంగారెడ్డిలోని గిరిజన న్యాయ కళాశాల

సంగారెడ్డి టౌన్ : గిరిజన విద్యార్థులు న్యాయ విద్యలో రాణించేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. దేశంలోనే మొదటిసారిగా గిరిజనుల కోసం రెసిడెన్షియల్ విధానంలో సంగారెడ్డిలో న్యాయ కళాశాలను మార్చి 27, 2021లో ప్రారంభించారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసిన గిరిజన, ఇతర విద్యార్థులు లా సెట్ ప్రవేశ పరీక్షలో ర్యాంకు సాధించి కళాశాలలో సీట్లు పొందాల్సి ఉంటుంది. ఉచిత విద్యతో పాటు హాస్టల్ వసతి, భోజనం, జిమ్, గ్రంథాలయం వంటి సౌకర్యాలు కల్పిస్తారు. ప్రతివారం కళాశాల క్లాసులతోపాటు కోర్టులో కూడా తరగతులు నిర్వహిస్తారు. పాఠశాల బోధనకు ఒక డైరెక్టర్ సహా ఐదుగురు అధ్యాపకులతో బృందాన్ని ప్రభుత్వం నియమించింది. ఉస్మానియా యూనివర్సిటీకి అనుసంధానంగా ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సుతో పాటు, మూడేళ్ల కోర్సును కొత్తగా ఈ సంవత్సరం నుంచే ప్రారంభించారు. కోర్సు పూర్తి చేసిన వారికి బీఏ, ఎల్‌ఎల్‌బీ న్యాయ శాస్త్ర పట్టాను అందిస్తారు. ఈ కళాశాలకు బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా అనుమతి ఉంది.



విద్యార్థులతో అవగాహన కార్యక్రమాలు(ఫైల్)

ఎంపిక ఇలా..

లా సెట్ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసేందుకు ఈనెల 30వ తేదీ వరకు గడువు ఉంది. జూన్ 6న పరీక్ష ఉంటుంది. విద్యార్థులు దరఖాస్తు చేసుకొని ర్యాంకు సాధించి కళాశాలలో సీటు పొందాలి. ఐదేళ్ల కోర్సుకు వయస్సు 21 ఏళ్లకు మించి ఉండకూడదు. ఐదేళ్ల కోర్సుతో పాటు మూడేళ్ల కోర్సుకు మొత్తం 60 సీట్లు ఉన్నాయి. సీటు సాధించిన విద్యార్థులకు ఉచిత న్యాయవిద్యతో పాటు వసతి కల్పిస్తారు. ఖర్చులకు నెలకు రూ.200 అందజేస్తారు. స్పోకెన్ ఇంగ్లిష్, కోర్టులకు సంబంధించిన తరగతులు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు.

హైకోర్టులో ఇంటర్న్‌షిప్ పూర్తి చేశా



కళాశాలలో మంచి అనుభవం ఉన్న అధ్యాపకులు తరగతులు నిర్వహిస్తున్నారు. హైకోర్టులో ఇంటర్న్ షిప్ శిక్షణ పూర్తి చేశా. కోర్టు సెక్షన్లు, న్యాయం ఎలా చేయాలనే వాటిని నేర్చుకుంటున్నా. కేసులు ఎలా వాదించాలో తెలుసుకుంటున్నా.

– అంజనేయులు, విద్యార్థి, నాగార్జున సాగర్, నల్లగొండ జిల్లా

సద్వినియోగం చేసుకోవాలి



సంగారెడ్డి జిల్లాతో పాటు రాష్ట్రంలోని వివిధ జిల్లాల గిరిజన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. 60 సీట్లలో 51 సీట్లు ఎస్టీలకు ఉంటాయి. మిగతావి రిజర్వేషన్ల ప్రకారం భర్తీ చేస్తాం. కాగా గిరిజన విద్యార్థులు ఇంటర్ పూర్తి చేసిన తర్వాత లా కళాశాలలో చేరేందుకు గ్రామాలు, తండాల్లో కళాశాల అధ్యాపకులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

–నిరీక్షణరావు, ప్రిన్సిపాల్, న్యాయ కళాశాల

ఘనంగా సిద్దేశ్వర ఉత్సవాలు

కంగ్టి(నారాయణఖేడ్): మండల కేంద్రమైన కంగ్టిలో శుక్రవారం శ్రీ సిద్దేశ్వర ఉత్సవాల్లో భాగంగా అగ్ని గుండంలో నుంచి నడుస్తూ భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా శిఖర స్థాపన, జెండా ఉత్సవం, అగ్నిగుండం ప్రవేశం, రథం ఊరేగింపు, ఆకట్టుకున్నాయి. అగ్నిగుండంలో భక్తులు వందల సంఖ్యలో నడిచి తమ భక్తిని చాటుకున్నారు. శనివారం కుస్తీ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు, ఏఓ శివరుద్రప్ప తెలిపారు.

జహీరాబాద్ పట్టణంలో..

జహీరాబాద్: పట్టణంలోని శ్రీ సిద్దేశ్వర ఆలయ వారికోత్సవాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. శుక్రవారం ఆలయంలో మంగళగౌరి, నవగ్రహ, నాగదేవత, హటకేశ్వర, పంచలింగేశ్వర, కాల భైరవ, నందీశ్వర, ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపనతో పాటు ధ్వజ స్తంభాన్ని ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమంలో ఈఓ శివరుద్రప్ప, ఆలయ కమిటీ సభ్యులు, దాతలు పాల్గొన్నారు.

రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడిగా డి.కిష్టయ్య



నూతనంగా ఎన్నికైన సభ్యులు

సంగారెడ్డి : రాష్ట్ర బీసీ సంఘం వైస్ ప్రెసిడెంట్‌గా డి.కిష్టయ్య నియమితులయ్యారు. ఈ మేరకు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య శుక్రవారం నియామక పత్రం అందజేశారు. ఇందులో భాగంగా జిల్లా కేంద్రంలో సంగారెడ్డిలో ఉన్న బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనతోపాటు పలువురు కొత్త సభ్యులతో నూతన బాడీని ఏర్పాటు చేశారు. స్టేట్ జనరల్ సెక్రెటరీగా కృష్ణ, జిల్లా అధ్యక్షుడిగా పి.మల్లికార్జున్ పటేల్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా జె.రాజేశ్వర్ స్వామి, జిల్లా ముఖ్య సలహాదారులుగా జె.చంద్రయ్య స్వామిలను ఎన్నుకున్నారు. జిల్లా నాయకులుగా స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రభు గౌడ్ నేతృత్వంలో జిల్లా నాయకులుగా సుదర్శన్ గౌడ్, వెంకట రాములు, కొండయ్య, విజయ్ భాస్కర్ స్వామి, ఎస్ పాండురంగం, శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి, సుభాష్ చంద్ర, ఆంజనేయులు, శశిధర్, హనుమంత్, దేవదాస్, యాదగిరి, ప్రవీణ్ కుమార్ , వికాస్ , కృష్ణ గౌడ్ నియమితులయ్యారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

పటాన్ చెరు టౌన్: నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐనోల్ సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు, అలాగే పటేల్‌గూడ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, కిష్టారెడ్డిపేట సబ్‌స్టేషన్ పరిధిలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఏఈ రామకృష్ణ పేర్కొన్నారు.

చిట్కుల్‌లో...

పటాన్‌చెరు: ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని చిట్కుల్‌లో శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. నాగార్జున కాలనీ, సన ఎస్టేట్, సాయి ప్రియకాలనీ, విజేత కాలనీ, రామ్‌రాజ్ కాలనీలలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని జిల్లా బీజేపీ అధ్యక్షురాలు సి.గోదావరి అన్నారు. శుక్రవారం రామచంద్రాపురం పట్టణంలోని ఆమె నివాసంలో ఎద్దుమైలారం గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో బీజేపీ శక్తివంతంగా తయారవుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు నాగేశ్వర్ రావు దేశ్‌పాండే, శ్రీనివాస్ రెడ్డి, దిలీప్ కుమార్, అరుణ్, ఓంకార్, అభిలాష్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల అదుపు

జహీరాబాద్: నేరస్తులను పట్టుకోవడంలో, దొంగతనాల నివారణలో సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడతాయని ఎస్‌ఐ కాశీనాథ్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని శాంతినగర్ హనుమాన్ మందిరం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన ఆలయ కమిటీ సభ్యులను అభినందించారు.

వెంకటాపూర్‌లో గంగామాత ఉత్సవాలు

నారాయణఖేడ్: ఖేడ్ మండలంలోని వెంకటాపూర్‌లో గంగామాత ఆలయ ఉత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రతి ఇంటి నుంచి మహిళలు బోనాలు చేసి గ్రామం నుంచి గ్రామ శివారులోఉన్న ఆలయం వరకు ఊరేగింపుగా వెళ్లి గంగామాతకు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. దారి పొడవునా పోతరాజుల నృత్యాలు, విన్యాసాలు గ్రామస్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.



నృత్యం చేస్తున్న పోతరాజులు

సంక్షిప్త వార్తలు

◆ **కేతకీలో భక్తుల పూజలు**



ఝరాసంగం(జహీరాబాద్): శ్రీ కేతకీ సంగమేశ్వర ఆలయంలో శుక్రవారం భక్తులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులు ఆలయ ఆవరణలోని అమృత గుండంలో పవిత్ర పుణ్యస్నానాలు ఆచరించి గుండంలోని జల లింగానికి పూజలు చేశారు. గర్భగుడిలోని పార్వతీపరమేశ్వరులను దర్శించుకున్నారు. అలాగే స్వామి వారికి అభిషేకం, కుంకుమార్చన, కంట్లం పూజ, వాహన పూజ తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.

◆ **గుర్తుతెలియని మృతదేహం లభ్యం**

పటాన్ చెరు టౌన్: గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన పటాన్ చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఇస్నాపూర్ మజీద్ సమీపంలో ఓ వ్యక్తి(45) మృతి చెందాడని శుక్రవారం పోలీసులకు సమాచారం వచ్చింది. వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

◆ **జహీరాబాద్‌లో సినీ నటి సందడి**



జహీరాబాద్: ప్రముఖ సినీ నటి డింపుల్ హయాతి శుక్రవారం జహీరాబాద్‌లో సందడి చేశారు. ఓ మొబైల్ దుకాణంలో ఆమె కొత్త మోడల్ సెల్‌ఫోన్‌ను ఆవిష్కరించారు. ఆమెను చూసేందుకు అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీంతో 65వ జాతీయ రహదారిపై పోలీసులు ట్రాఫిక్‌ను నియంత్రించారు.

◆ **వీరభద్రేశ్వర జాతర మహోత్సవాలు**

రాయికోడ్(అందోల్): రాయికోడ్‌లోని వీరభద్రేశ్వర ఆలయ జాతర మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. పల్లకి సేవను మోస్తూ, దండకాలు వేస్తూ భక్తులు నిష్ఠతో పాల్గొన్నారు. ఆలయంలో స్వామి వారి కల్యాణ మహోత్సవ కార్యక్రమం ఆధ్యాత్మిక గురువులచే నిర్వహించారు. జిల్లా నుంచే కాకుండా పాటు మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల భక్తులు విచ్చేసి భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం నిర్వాహకులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

◆ **మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ..**



సంగారెడ్డి జోన్: కొండాపూర్ మండల పరిధిలోని గిర్మాపూర్ గ్రామ శివారులో జాతీయ రహదారి పక్కన శుక్రవారం మిషన్ భగీరథ పైపులైన్ లీక్ అయింది. దీంతో తాగునీరు పెద్ద ఎత్తున వృథాగా పోయింది. హైదరాబాద్ నుంచి జహీరాబాద్, కర్ణాటక వైపు వెళ్తున్న వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఒక్కసారిగా తాగునీరు ఎగిసి పడటంతో ఫౌంటెన్ మాదిరిగా దృశ్యం కనిపించింది. గమనించిన స్థానికులు అధికారులకు సమాచారం అందించారు.

గ్యాస్ గోదాంలో జాగ్రత్తలు పాటించాలి



అగ్ని ప్రమాదాలను ఎలా నివారించాలో వివరించే పోస్టర్‌ను అందజేస్తున్న అధికారులు

సదాశివపేట(సంగారెడ్డి): నిర్వాహకులు గ్యాస్ గోదాంలో జాగ్రత్తలు పాటించాలని అగ్నిమాపక అధికారి భిక్షపతి సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం హేమ హెచ్‌పీ వంట గ్యాస్ గోదాంలో పనిచేసే సిబ్బందికి గ్యాస్ లీకై మంటలు వస్తే ఎలా నివారించాలో వివరించి అవగాహన కల్పించారు. వంటగ్యాస్ లీకై సిలిండర్‌కు మంటలు అంటుకుంటే ఆర్పే విధానాన్ని ప్రయోగాత్మకంగా చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో ఎల్‌ఎఫ్ అబ్దుల్‌మూన్, ఆపరేటర్ తయ్యబ్, రవీందర్, సాయికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహనతోనే ప్రమాదాల నివారణ

జహీరాబాద్ టౌన్: అవగాహనతోనే అగ్ని ప్రమాదాల నివారణ సాధ్యమని, ప్రమాదాలు జరిగినప్పుడు అప్రమత్తంగా ఉండాలని ఫైర్‌స్టేషన్ అధికారి శ్రీనివాస్ అన్నారు. అగ్నిమాపక శాఖ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం బూచినెల్లి వద్ద గల ఎంజీ కంపెనీలో అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రమాదాల నివారణపై మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎల్‌ఎఫ్‌లు అశోక్, సలీమ్, పవన్, ఫైర్‌మెన్‌లు రామకృష్ణ, నాగరాజు పాల్గొన్నారు.

డంపింగ్‌యార్డ్ పనులు నిలిపివేయాలి

73వ రోజుకు చేరుకున్న నిరాహార దీక్షలు



నిరాహార దీక్షలో పాల్గొన్న నాయకులు

జిన్నారం (పటాన్‌చెరు): ప్రభుత్వం కాలయాపన చేయకుండా డంపింగ్ యార్డ్ పనులను నిలిపివేయాలని జేఏసీ, పలువురు నాయకులు డిమాండ్ చేశారు. గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని ప్యారానగర్ డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు వ్యతిరేకంగా కొనసాగుతున్న నిరసన కార్యక్రమాలు శుక్రవారం 73వ రోజుకు చేరుకున్నాయి. జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలో గుమ్మడిదల మాజీ జడ్పీటీసీ కుమార్ గౌడ్, రైతు నాయకులు సదానంద రెడ్డి, బాల్‌రెడ్డి పాల్గొని నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్ణయం వెలువడే వరకు తమ న్యాయ పోరాటాన్ని ఆపేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు మాజీ సర్పంచ్ నరసింహారెడ్డి, మంద భాస్కర్ రెడ్డి, సూర్యనారాయణ దేవేందర్ రెడ్డి సత్యనారాయణ, మోహన్ రెడ్డి, మల్లేష్ గౌడ్, రైతులు, మహిళలు, యువకులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఇల్లు నిర్మించుకునే వారిని గుర్తించండి



న్యాల్‌కల్: సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

న్యాల్‌కల్(జహీరాబాద్): ఇందిరమ్మ పథకంలో ఇల్లు మంజూరై నిర్మించేందుకు సిద్ధంగా ఉన్న వారిని గుర్తించాలని ఎంపీడీఓ రాజశేఖర్ కౌలాస్ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. శుక్రవారం స్థానిక ఎంపీపీ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇల్లు కట్టుకునేందుకు ముందుగా నిరుపేదలు, వికలాంగులకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని, అన్ని గ్రామాల్లో ఈనెల 21వరకు సర్వే నిర్వహించాలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ రాజిరెడ్డి, ఎంపీఓ సౌజన్య పాల్గొన్నారు.

పటాన్ చెరులో...

పటాన్ చెరు టౌన్: మండలంలోని రుద్రారంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మండల పంచాయతీ అధికారి హరిశంకర్ గౌడ్ హాజరై ఎలిజిబిలిటీ లిస్టును పరిశీలించారు. అనంతరం గ్రామ కార్యదర్శి రాజుకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సుధీర్ రెడ్డి, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

బస్‌డిపోలో మర్యాద దినోత్సవం



మర్యాదపూర్వకంగా ప్రయాణికులకు పూలు అందజేస్తున్న డిపో మేనేజర్

జహీరాబాద్: జహీరాబాద్‌లోని ఆర్టీసీ బస్‌డిపోలో శుక్రవారం అధికారులు, సిబ్బంది మర్యాద దినోత్సవం నిర్వహించారు. డిపో మేనేజర్ జాకీర్ హుస్సేన్ ఆధ్వర్యంలో సిబ్బంది ప్రయాణికులకు మర్యాద పూర్వకంగా పూలు అందించి స్వాగతించారు. ఎండీ సజ్జనార్ విడుదల చేసిన క్యూఆర్‌కోడ్‌తో రూపొందించిన కీ చైన్‌ను డీఎస్పీ రామ్మోహన్ రెడ్డి విడుదల చేశారు. ఈ సందర్భంగా విధుల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చిన సిబ్బందికి, నమ్మకమైన కస్టమర్లకు కీ చైన్‌ను అందజేశారు.

అమిత్ షా క్షమాపణలు చెప్పాలి

టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి



మాట్లాడుతున్న జగ్గారెడ్డి

సంగారెడ్డి : పార్లమెంట్‌లో అంబేడ్కర్‌ను అవమానించేలా మాట్లాడిన అమిత్ షా క్షమాపణ చెప్పాలని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం సంగారెడ్డి పట్టణంలో జై బాపూ, జై భీమ్, జై సంవిధాన్ నినాదాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అంబేడ్కర్‌ను అమిత్ షా కించపరిచేలా మాట్లాడటంపై మండిపడ్డారు. ఈ రోజు మనం స్వేచ్ఛగా జీవిస్తున్నామంటే, అలాంటి చట్టాలు తీసుకువచ్చిన అంబేడ్కర్ మహనీయుడన్నారు. త్వరలోనే సంగారెడ్డిలో సీఎం సభ ఉంటుందని ఆయన చెప్పారు.

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే



హత్నూర : చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

సంగారెడ్డి (హత్నూర): మండల పరిధిలోని గ్రామాల్లో గుడ్ ఫ్రైడే సందర్భంగా శుక్రవారం పలు చర్చిలలో క్రైస్తవులు ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా కాసాలా చర్చ్ రెవరెండ్ బీ కాంతారావు మాట్లాడుతూ.. ప్రతి మానవుడు ఇతరుల పట్ల ప్రేమ, అభిమానం కలిగి గౌరవించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాస్టొరేట్ కమిటీ మెంబర్స్ భాస్కర్, ప్రభాకర్, లక్ష్మణ్, భాస్కర్, శంకర్ ప్రభాకర్, యాదగిరి, సాగర్, ఆశయ్య, వీరయ్య పాల్గొన్నారు.

సంగారెడ్డి పట్టణంలో...

సంగారెడ్డి : క్రీస్తు చనిపోయిన దినాలను జ్ఞాపకం చేసుకుంటూ ఎంతో భక్తిశ్రద్ధలతో పోతిరెడ్డిపల్లి చౌరస్తాలో ఉన్న సంగారెడ్డి రాక్ చర్చిలో శుక్రవారం గుడ్ ఫ్రై డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వందలాది మంది క్రైస్తవులు పాల్గొని ప్రభువును ఆరాధించారు. ఈ సందర్భంగా పాస్టర్ యేసుపాల్ మాట్లాడుతూ ఆదివారం జరగనున్న ఈస్టర్ కార్యక్రమాలకు మందిరం సన్నద్ధమైందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రదర్ రాజు, ప్రవీణ్ పాల్గొన్నారు.

న్యాల్‌కల్ మండలంలో...

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని గ్రామాల్లో ఉన్న చర్చిలకు ప్రజలు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా పాస్టర్లు క్రీస్తు గురించి దైవ సందేశం ఇచ్చారు.